క్లుప్తంగా

బీఎస్ఎఫ్ భద్రత దళాల అధికారులకు సత్కారం



అసిస్టెంట్ కమాండెంట్‌కు మెమెంటో అందజేస్తున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బందోబస్తు చర్యలు నిర్వహించడానికి బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి వచ్చిన కేంద్ర భద్రతా బలగాలను మంగళవారం బుధాగెస్ట్ హౌజ్ ఆవరణలో సత్కరించారు. బీఎస్ఎఫ్ జీకాయ్ , 160 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ డేవిడ్ లాల్‌కు సీపీ తరపున బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి శాలువా కప్పి ఆత్మీయ సత్కారం చేశారు. మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా బీఎస్ఎఫ్ భద్రతా దళాలు రామగుండం బెటాలియన్‌కు వచ్చినట్లు తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అత్యంత సమర్థవంతంగా బీఎస్ఎఫ్ బలగాలు విధులు నిర్వర్తించాయని పేర్కొన్నారు. ఎంతో నిబద్ధత, క్రమ శిక్షణతో విధులు నిర్వర్తించి ఎక్కడ ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా కమిషనరేట్ పోలీసులకు సహకరించారని ప్రశంసించారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, తాళ్లగురిజాల ఎస్సై నరేష్, బీఎస్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



శిబిరం వద్ద లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని శాంభవి కంటి ఐ విజన్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. సింగరేణి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి 50 మంది హాజరు కాగా వీరిలో ఐదుగురికి కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిని శస్త్ర చికిత్స కోసం వివిధ ఆసుపత్రులకు సిఫారసు చేశారు. ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించారు. కంటి వైద్యనిపుణుడు కొంకటి అంజయ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సింగరేణి లయన్స్‌క్లబ్ సెక్రెటరీ వంగల చక్రపాణి, పెద్ది రాజేందర్, నల్మాస్ సంతోష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి సాయం..!

భీమారం: చెన్నూర్ పట్టణానికి చెందిన వృద్ధురాలు మంగళవారం భీమారం మండల కేంద్రంలోని బంధువుల ఇంటికి వచ్చి దారి తప్పిపోయింది. బస్టాండ్ నుంచి హైస్కూల్ వైపు రోదిస్తూ వెళ్తున్న వృద్ధురాలిని చూసిన స్థానికులు పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను భీమారంలోని కొత్తగూడెం వద్దకి వెళ్లాలని చెప్పింది. దీంతో సిరిపురం మధుకర్ అనే యువకుడు తన బైక్‌పై తీసుకెళ్లి వాళ్ల బంధువుల ఇంటి వద్ద దింపి వచ్చారు. ఈ విషయమై మండలంలోని సోషల్ మీడియాలో ఫొటోలు వైరలయ్యాయి. ఈ మేరకు మధుకర్‌ను పలువురు అభినందిస్తూ పోస్టులు పెట్టారు.

సైడ్‌బర్మ్ పోయరా..!



భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో వేసిన సీసీ రోడ్డుపై రెండు వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కన్నెపల్లి సబ్ స్టేషన్ నుంచి జన్కాపూర్ వరకు సుమారు రూ.2 కోట్లతో మంజూరైన ఈ సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలో సీసీ రోడ్డు 12 ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మించారు. సీసీ రోడ్డు పక్కన సైడ్‌బర్మ్ నిర్మాణం చేపట్టకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే ఒక వాహనం వెనుదిరిగి వెళ్తే తప్పా, మరో వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డు నిర్మాణంతో మెట్‌పల్లి-లింగాలకు వెళ్లే ఆర్టీసీ బస్సు కొద్ది రోజులుగా రావడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సైడ్‌బర్మ్ నిర్మాణం చేపట్టి వాహనాలు వెళ్లే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వడ్లు జోకుతలేరు..!

- కుప్పలు పోసి 25 రోజులు
- పడిగాపులు కాస్తున్న రైతులు



కుందేళ్‌పహాడ్ రోడ్ పక్కన ధాన్యం కుప్పలు..

దండేపల్లి: పంటను అమ్ముకునేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలోని కుందేల్‌పహాడ్ గ్రామానికి చెందిన పలువురు రైతులు యాసంగిలో పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు రోడ్డుపక్కన కుప్పలుగా పోసి ఉంచారు. కుప్పలు పోసి 25 రోజులు గడుస్తున్నా ధాన్యాన్ని తూకం వేయడం లేదని రైతులు వాపోయారు. అకాల వర్షాలతో, ఆందోళన చెందాల్సి వస్తుందని, ధాన్యం తడవకుండా కుప్పలపై కవర్లు కప్పి జాగ్రత్త పడుతున్నామని, గాలికి కవర్లు కొట్టుకుపోవడంతో, ధాన్యం తడిసి పోయేలా ఉండటంతో, కుప్పలపై కవర్లుకప్పి బండరాళ్లు ఎత్తుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పేర్కొంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కొన్నిచోట్ల ఇబ్బందులే ఉంటున్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి కుప్పలు పోసిన ధాన్యాన్ని తూకం వేసి, బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు.

రేపు, మాపు అంటుండ్రు..



యాసంగిలో ఐదెకరాల్లో పండించిన వడ్లను కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు రోడ్డుపక్కన కుప్పగా పోసి ఉంచాను. కాంటా వేయమంటే రేపు.. మాపు అంటుండ్రు, ఏప్రిల్ 20 తారీకున కుప్ప పోసినా, ఇప్పటికీ కాంటా కాలేదు.

- జగతిరావు, రైతు, కుందేల్‌పహాడ్

వానత్తే భయమేస్తంది..



అడ్లు తెచ్చి రోడ్డుపక్కన కుప్పగా పోసినం. రోజులు గడుస్తున్నా కాంటా పెడుతలేరు. వానలు వస్తే భయమయితంది. అడ్లు తడుస్తే ఇబ్బంది అయితదని కవర్లు కిరాయికి తెచ్చి కుప్పల మీద కప్పి కాపలా ఉంటున్నాం. తొందరగా కాంటా వేయాలి

- ముత్తు, రైతు, కుందేల్‌పహాడ్

హమాలీల కొరతతో..

హమాలీల కొరత కారణంగా కాంటా వేయడంలో కొంత ఆలస్యం అవుతోంది. కొనుగోలు కేంద్రాలకు దూరంగా కొందరు రైతులు ధాన్యాన్ని కుప్పలుగా పోసి ఉంచారు. ముందుగా, కొనుగోలు కేంద్రాలకు సమీపంలో ఉన్న వాటిని తూకం వేసి, తరువాత దూరంగా ఉన్నవాటిని తూకం వేస్తాం. దీనికి తోడు లారీలు కూడా సకాలంలో రావడం లేదు. కుందేల్‌పహాడ్ సమస్యను ఒకటి, రెండు రోజుల్లో పరిష్కరిస్తాం.

- బ్రహ్మయ్య, ఏపీఎం, దండేపల్లి

ఆలస్యమవుతున్న కొనుగోళ్లు



దుగ్నెపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

చెన్నూర్‌రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని లంబడిపల్లి, సుద్దాల, ఆస్నాద, సోమనపల్లి, ముత్తరావుపల్లి, అంగ్రాజ్‌పల్లి, పొక్కూరు, కిష్టంపేట గ్రామాలలో ఐకేపీ, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొందరు రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చి పది రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ అకాల వర్షాలు కురిస్తే ధాన్యం అంతా తడిసి పోతుందని రైతులు వాపోతున్నారు. వీటికి తోడు టార్పాలిన్లు లేకపోవడంతో అద్దెకు తీసుకొచ్చే పరిస్థితి ఏర్పడిందనివాపోతున్నారు. ఒకవేళ భారీ వర్షాలు కురిస్తే ధాన్యం అంతా కొట్టుకుపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వారం రోజులైతంది..



కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొచ్చి వారం రోజులైతాంది. తేమ ఉందని ధాన్యాన్ని ఆరబోయమన్నారు. మొన్న కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. ఇంతవరకు కాంటా చేయలేదు. ఎప్పుడు వర్షం కురుస్తుందో అని ఇక్కడే కాపలా ఉంటున్నా.

- బానయ్య, రైతు, సుద్దాల

చెన్నూర్ మండలంలో కొంచెం మెరుగు

- మున్సిపాలిటీలో తగ్గిన పోలింగ్
- అవగాహన సదస్సులు పెట్టినా ముందుకు రాని ఓటర్లు



చెన్నూర్‌లో ఓట్లు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు(ఫైల్)

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో 1,93,778 ఓటర్లు ఉండగా ఇందులో 1,32,787 మంది ఓట్లు వేశారు. నియోజకవర్గంలో 68.52 శాతం పోలింగ్ నమోదు అయింది. ఓటు హక్కు వినియోగం కోసం అధికారులు వివిధ రకాల పద్ధతులతో అవగాహన సదస్సులు నిర్వహించినా పోలింగ్ శాతం మాత్రం పెరగలేదు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికలలో పోలింగ్ శాతం తగ్గింది. చెన్నూర్ మండలంలో 74.37 శాతం పోలింగ్ నమోదు అయింది. మండలంలో పోలింగ్ కొంత మెరుగ్గా పడినప్పటికీ చెన్నూర్ మున్సిపాలిటీలో 61.87 శాతం నమోదు కాగా అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికలలో పోలింగ్ శాతం తగ్గింది. మండలంలో 25,971 మంది ఓటర్లు ఉండగా ఇందులో ఇందులో పురుషులు 12,836, స్త్రీలు 13,135 ఓటర్లు ఉన్నారు. మండలంలో 19,317 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 9692, స్త్రీలు 9625 ఓట్లు వేశారు. చెన్నూర్ మున్సిపాలిటీలో 19,422 ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 9514, స్త్రీలు 9908 ఉండగా 12,108 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 6125, స్త్రీలు 5983 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మంచిర్యాలలో తగ్గిన ఓటింగ్

- ఎమ్మెల్యే ఎన్నికలతో పోలిస్తే తక్కువే
- మహిళల కంటే పురుషులే ఎక్కువగా ఓటేశారు




క్యూలో నిలబడిన పురుష ఓటర్లు(ఫైల్)

మంచిర్యాలటౌన్: నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు చూపించిన ఉత్సాహాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం చూపించలేక పోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,74,807 కాగా, 1,90,057 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 2,78,738 మంది కాగా, 1,69,591 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులోనూ మహిళా ఓటర్లు 1,40,648 మంది ఉంటే అందులో కేవలం 84,437 మంది మాత్రమే ఓటు వేశారు. పురుష ఓటర్లు 1,38,064 మంది ఉంటే 85,152 మంది ఓటు వేసి, మహిళల కంటే ముందంజలో నిలిచారు. మొత్తంగా ఓటింగ్‌లో 61.68 శాతం పురుషులు ఓటు వేస్తే, 60.03శాతం మహిళలు, 7.69శాతం ఇతరులు వారి ఓటు హక్కును వినియోగించుకోగా, మంచిర్యాల నియోజకవర్గంలో పోలింగ్ 60.84శాతంగా నమోదైంది.

నియోజకవర్గంలో మండలాలు, మున్సిపాలిటీల వారీగా వచ్చిన ఓట్లు

	ఎమ్మెల్యే ఎన్నికల్లో పోలైన ఓట్ల వివరాలు		పార్లమెంటు ఎన్నికల్లో పోలైన ఓట్ల వివరాలు		
మండలం	మొత్తంఓట్లు	వేసినఓట్లు	మొత్తంఓట్లు	వేసినఓట్లు	శాతం
దండేపల్లి	40,828	32,714	41,301	29,646	71.78
లక్సెట్టిపేట	24,310	20,126	24,668	18,341	74.35
(మండలం)					
లక్సెట్టిపేట	17,772	13,031	17,879	11,796	65.98
(మున్సిపాలిటీ)					
హాజీపూర్	26,883	22,240	27,116	19.949	73.57
మంచిర్యాల	96,406	61,632	98,691	55,430	56.17
నస్పూర్	68,608	40,314	69,083	34,431	49.84
మొత్తం	2,74,807	1,90,057	2,78,738	1,69,593	60.84


రోడ్డుకు మరమ్మతు చేపట్టరా?



భీమారం: భీమారం-నెన్నెల ప్రధాన రహదారిలో నర్సింగాపూర్ సమీపంలో గత వర్షాకాలంలో వరదల కారణంగా కోతకు గురైన బీటీరోడ్డుకు ఇప్పటి వరకు మరమ్మతు చేపట్టలేదు. కోతకు గురైన చోట రెండు వాహనాలు ఒకేసారి ఎదురెదురుగా వస్తే మాత్రం ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

అప్రకటిత కరెంట్ కోతలు..!

- వేసవి తాపానికి విలవిల్లాడుతున్న ప్రజలు
- బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



సబ్ స్టేషన్

బెల్లంపల్లిరూరల్: నాణ్యమైన విద్యుత్‌ను 24 గంటల పాటు నిరాటంకంగా సరఫరా చేస్తామన్న అధికార యంత్రాంగం హామీలు క్షేత్రస్థాయిలో నీటి మూటలే అవుతున్నాయి. అప్రకటిత విద్యుత్ కోతలతో జనం అల్లాడుతున్నారు. అసలే తీవ్రమైన వేసవి తాపానికి విలవిలలాడుతున్న ప్రజలకు ఈ విద్యుత్ కోతలు మరింత మంట పుట్టిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో గ్రామీణుల వెతలు అన్నీఇన్నీ కాకున్నాయి.

గంటల తరబడి...

బెల్లంపల్లి మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండల పరిధిలో దాదాపు 8590గృహ వినియోగ కనెక్షన్లు ఉండగా, 158 కమర్షియల్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే ఇంత జనాభా ఉన్న మండలంలో మెరుగైన సేవలు అందించాల్సిన విద్యుత్ అధికారులు మాత్రం, తీవ్ర అలసత్వంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు అనేకం. కరెంట్ కోతలకు సంబంధించి ఎలాంటి ముందస్తు ప్రకటనలు లేకుండా ఇష్టారీతిన కోతలు విధిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. సరాసరిన నాలుగు నుంచి ఆరు గంటలు అప్రకటిత కరెంట్ కోతలు ఉండడంతో ప్రజలు ఎండ వేడిమికి మాడిపోతున్నారు. అసలే వేసవి కాలం, పిల్లలకు సెలవులు సైతం ఉండడంతో ఇంటి వద్దనే ఉంటున్న వారికి కరెంట్ లేమి తీవ్ర అలసటను కలిగిస్తోంది. తీవ్ర ఉక్కపోతతో సహజీవనం చేస్తున్న ప్రజలు ఈ కరెంటు కోతలతో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయానికి అంతంతే...

గృహ వినియోగాల మాదిరిగానే వ్యవసాయానికి సరఫరా అయ్యే విద్యుత్ సరఫరాలో కూడా ఆటంకాలు ఎదురవుతున్నాయి. విచ్చలవిడిగా కరెంట్ కోతలతో రైతులు సతమతమవుతున్నారు. యాసంగి సీజన్ మొత్తం తుది వరకు పంటను కాపాడుకునేందుకు పొలాల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియక పంటకు నీరు పెట్టేందుకు అక్కడే వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉంటున్నాయి.

అధికార యంత్రాంగం బాధ్యతారాహిత్యం..!

కరెంట్ సరఫరా సమయంలో అప్పుడప్పుడు అంతరాయం ఏర్పడడం సర్వసాధారణమే. ఏదైనా మరమ్మతుల సమయంలో విద్యుత్ సిబ్బంది ఎల్‌సీ తీసుకోవడం.. పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం నిత్యం జరిగే తంతే. అయితే ఇటీవల కాలంలో గంటల తరబడి అప్రకటిత కరెంట్ కోతలు విధిస్తున్న అధికారులు, అదే స్థాయిలో బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కరెంట్ కోతల సమయంలో వినియోగదారులు సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే కనీసం స్పందన ఉండడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఏఈకి ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రజలకు సేవలు అందించడంలో అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, అప్రకటిత కరెంట్ కోతలను నివారించి ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని గ్రామీణులు కోరుతున్నారు.

ఫోన్‌చేస్తే స్పందిస్తలేరు..



ఈ మధ్య కరెంట్ ఎప్పుడు పడితే అప్పుడు పోతోంది. కరెంట్ పోయిన సమయంలో సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే ఎవరూ ఫోన్ ఎత్తడం లేదు. ఎత్తినా సరైన సమాధానం ఇవ్వడం లేదు. ఇది సరైన పద్ధతి కాదు. అధికారులు దృష్టి సారించాలి.

బుడిమే విజయ్, ఆకెనపల్లి

కోతలు లేకుండా చూడాలి



కరెంట్ కోతల వల్ల గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒక రోజులో కనీసం నాలుగు గంటలు కరెంట్ పోతోంది. అసలే ఎండాకాలం పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ అప్రకటిత కరెంట్ కోతలు లేకుండా చూడాలి.

- చిలుముల సాయికుమార్, తాళ్లగురిజాల

సమస్యలు లేకుండా చూస్తాం

గ్రామాల్లో కరెంట్ కోతలు లేవు. సబ్‌స్టేషన్‌లో కానీ, గ్రామాల్లోని లైన్‌లలో ఏమైన సమస్యలు వచ్చినప్పుడు కోతలు ఉంటున్నాయి. మరమ్మతు చేసిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నాం. మరమ్మతు చేసే క్రమంలో సిబ్బంది ఫోన్‌లో స్పందించడం ఇబ్బంది అవుతోంది. ఇకపై కోతలు లేకుండా, సిబ్బంది స్పందించే విధంగా చర్యలు తీసుకుంటాం.

- రాంమనోహర్, ఏఈ, విద్యుత్ శాఖ

ఓటెత్తిన గిరిజనం.. వెల్లివిరిసిన చైతన్యం

- గూడేల్లో 85 శాతం పోలింగ్ నమోదు
- ఫలించిన అధికారుల కృషి



క్యూలో ఉన్న నర్సాపూర్ గిరిజనులు (ఫైల్)

తాండూర్: వారంతా అక్షరం ముక్కరాని అడవి బిడ్డలు. రాజ్యాంగం అంటే ఏమిటో, రాజ్యాంగంలో ఓటుకు ఉన్న విలువ ఏపాటిదో తెలియని అమాయక గిరిపుత్రులు.. అయితేనేం.. నాగరికత తెలిసినా, విద్యావంతులమని చెప్పుకునే పట్టణప్రాంత వాసుల కన్నా ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఎంతో పరిణతి చెందారు. రెక్కాడితే కాని డొక్కాడని గిరిజనులు తమ రోజువారీ పనులను పక్కన పెట్టి ఓటుపై తమకున్న నిబద్ధతను చాటుకుని స్ఫూర్తిదాయకంగా నిలిచారు తాండూర్ మండలంలోని మారుమూల గ్రామాల గిరిజనులు.

గిరిపల్లెల్లో పోటాపోటీగా...

తాండూర్ మండలం నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నర్సాపూర్, అబ్బాపూర్, బెజ్జాల, ఆసాల మాడ, గంపనపల్లి, రాముగూడెం, బాపుగూడెం, లచ్చుగూడెంతో పాటు మరో 10 చిన్నచిన్న గూడేలు ఉన్నాయి. సోమవారం జరిగిన ఎన్నికల్లో ఆయా గూడేల గిరిపుత్రులు చైతన్యవంతమైన స్ఫూర్తిని ప్రదర్శించారు. బెజ్జాల పోలింగ్ కేంద్రంలో 326 మంది ఓటర్లకు గాను 278 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నర్సాపూర్ పోలింగ్ కేంద్రంలో 450 మంది ఓటర్లకు గాను 382 మంది ఓటర్లు ఓటు వేశారు. ఆ రెండు పోలింగ్ కేంద్రాల్లో కలిపి 85 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ శాతాన్ని పెంచడం కోసం ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో చేసిన ప్రయత్నాలు, ఓటు విలువ ఎంతటి శక్తివంతమైందో తెలియపర్చడంలో గిరిజనులు ప్రభావితమైనట్లు తెలుస్తోంది. గతానికి భిన్నంగా గిరిజనులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఓట్లు వేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

బురద రోడ్డుతో అవస్థలు..!



చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల గ్రామానికి వెళ్లే రహదారి బురదమయంగా మారింది. మట్టి రోడ్డు కావడంతో ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు మొత్తం బురదమయంగా మారి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారి ఇలా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

దరఖాస్తు చేసుకోండి

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం పొందేందుకు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అనీలా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.